# వంటయింట్లో వస్తుసంగ్రామం

రాత్రి యింటివాళ్ళు ముసలమ్మకు ఇల్లు వప్పగించి అంతా కలిసి సినీమాకి పోయారు. వాళ్లు వెళ్లిన కాసేపటికి ఇంటితలుపులన్నీ బిగించేసి, తనూ పెత్తనాలకు బయలుదేరింది ముసలమ్మ.

వంటయింటి సామాను ఒక్కసారిగా మేలుకొంది. వస్తుసంచారం ప్రారంభమైంది. బరువు [illegible]ట్టేలేని వుల్లిపాయ ఒకటి, బోనులో తీగ మీదనుంచీ తప్పించుకొని గబగబా బయటకు వచ్చి, వీపుమీది గాయాన్ని చూసుకుని ఏడుస్తూ ఒక్కదూకులో వచ్చి, ఉల్లిపాయల బుట్టలో తనవాళ్లను కలుసుకొంది.

ఈ వింతను కళ్లారచూసిన కంచుబిందెకి వుడుకుమోతుతనం వచ్చింది పక్కనున్న రేకుబిందెను మోచేత్తో పొడుస్తూ "చూశావటే, ఉల్లిముండసాహసం"—అని నోరు నొక్కుకుంది. మోచేతిపోటుకు సొట్టపడిన రేకుబిందె జవాబు చెప్పకుండా మూతి ముడుచుకుంది.

కంచుబిందెకు వళ్ళు నలసలా కాగిపోయింది. "మాట్లాడవేం ?" అని మరోపోటు పొడిచింది.

"ఛీ పో! సిగ్గులేనిదానా"—అని రేకుబిందె యిటు మూతి అటుకి తిప్పుకుంది.

వెంటనే కంచుబిందెమీది గ్లాసు ఎగిరిదూకి సైమంటా "ఓసి బక్కపీనుగా! నీకెంత పొగరే—"అంటూ రేకుబిందె నెత్తినెక్కి నాలుగుపోట్లు పొడిచింది. కంచుబిందే, కంచుగ్లాసూ కలిసి రేకుబిందెతో యుద్ధానికి దిగినై.

స్వతహాగా ఏదీ చూస్తూ ఊరుకోలేని మట్టికడవ మధ్యన ఓపోజు పెట్టి "పోట్లాడతారేమర్రా-" అంటూ తీర్పు తీర్చడానికి వచ్చింది అక్కడికి తానోపెద్ద ఆరిందాలాగ.

"పోవే ఓటిముఖందానా, నీకెందుకు మాగొడవ-" అంటూ అమాంతంగా మట్టికడవ పొట్టపగలకొట్టి మళ్ళీ తన యథాకార్యక్రమానికి వెళ్లిపోయింది – కంచుబిందె.

రావుడుగు వెంకటేశ్వరరావు

ఈ దౌర్జన్యాన్ని చూసి సహించలేక, మూలనున్న రోలూ రోకలీ, అలమారకున్న తలుపు చెక్కలూ యుద్ధరంగంలోకి దిగినై; రేకుబిందె పక్షాన. బిందెలూ చెంబులూ ఒక పక్షమూ, రోలు రోకలీ తలుపు చెక్కలూ ఒక పక్షమూ. ఇంట్లో హోరాహోరీగా యుద్ధం జరుగుతోంది.

ఇంతలో పచ్చళ్ళగూట్లో అప్పుడే నిద్రలేచిన ఆవకాయజాడీ గోంగూరజాడీని అడిగింది "ఏమిటా గోల—" అని. ఎన్నాళ్లనుంచో పగబట్టిన గోంగూరజాడీ— "నన్నడక్కపోతే పోయి చూడరాదూ!—" అంటూ ఒక్కతోపు తోసింది ఆవకాయ జాడీని.

ఆవకాయ జాడీ బద్దలైంది. గూట్లో మరోయుద్ధం ప్రారంభమయింది. అమాంతంగా అన్ని రాచ్చిప్పలూ, జాడీలూ ఒక్కసారిగా క్రిందపడి మరణించినవై వీరస్వర్గాన్న అలంకరించ వెళ్లాయి. జాడీలు అనే బందిఖానాల్లోంచి పచ్చళ్లు స్వాతంత్రం పొందినవై, యిల్లంతా వ్యాపించినై. ఆ ధరువుల్లేకుండా బ్రతుకలేని అన్నం, యిదే సమయమని, గబగబా గిన్నెలోనుంచి బయటకు వచ్చేసి పచ్చళ్ళలో పొర్లాడి మళ్లీ ముక్తసరిగా వచ్చి అన్నపుగిన్నెలో ముడుచుకు కూర్చుంది. కుస్తీలతో అలసిపోయిన యిరుపక్షాలవారూ యుద్ధాన్ని ఆపి, సిద్ధంగా తయారై వున్న భోజనాన్ని ఆరగించి మళ్లీ సంగ్రామం మొదలుపెట్టారు.




ఎస్ట్రెలా బ్యాటరీలు
NAS E12

# వంటయింట్లో వస్తుసంగ్రామం

వీధిలో పెత్తనాలు చేస్తున్న చెవిటి ముసలమ్మకు ఈ రణగొణ ధ్వని కొద్దిగా వినిపించింది. ఆమె జాగ్రత్తగా చెవియొగ్గి వినేలోగా ఆ ధ్వని ఆగిపోయింది. మనస్సుకి కలిగిన అనుమానం నివృత్తి కాగా ఆమె మళ్లీ వెళ్ళిపోయింది.

సరిగ్గా అదే సమయంలో దొంగ పిల్లి ఒకటి కిటికీ ఊచల్లోంచి లోపలికి దూకి ఉట్టిమీది పాలు తాగుదామని ఉట్టి ఎక్కింది. యుద్ధాన్ని వింతగా చూస్తూ వొళ్లు మరచివున్న వుట్టి, పిల్లి మీదకు దూకగానే వులిక్కిపడి పిల్లినీ, పాలకుండనూ కూడా క్రిందకు తోసేసింది. పాలకుండ బద్దలైంది. నేలపాలయినా సరే ఆ పాలను తాగుదామని పిల్లి ఆశతో వచ్చేలోపుగా ఇరుపక్షాలవారూ ఆ పిల్లిపిల్లను నాలుగు తన్ని వెళ్ళగొట్టి, క్షీరపానం చేసి మళ్ళీ యుద్ధం మొదలు పెట్టారు.

మళ్ళీ వంటయింట్లో ఓటిబిందెల మోత ప్రారంభమయింది. ఆ ధ్వని, ఊసుబోక వీధిలో కబుర్లాడుకొంటూన్న ముసలమ్మకు యీసారి స్వచ్ఛంగా వినిపించింది. "ఏమిటి చప్పుడు"-అంటూ ఆమె యింట్లోకి వస్తూంటే గుమ్మంలో చావ సిద్ధంగా వున్న పిల్లి పిల్ల ఎదురైంది. ఇంట్లో చప్పుడు యీ పిల్లి మూలంగానే ఐవుంటుందని భావించి, దాని బుర్ర కాస్తా తనదుడ్డుకర్రతో రామకీర్తన పాడించింది ముసలమ్మ. సామాను సర్ది పెట్టటానికి యింట్లోకి వెళ్ళి వంటగది తలుపు తెరచింది. ఇంతకు మున్నెన్నడూ కనీవినీ ఎరుగని సామాను సంగ్రామాన్ని సాక్షాత్తు తమ వంటయింట్లోనే చూసి, ముక్కుమీద వేలేసికొని ముసలమ్మ గుమ్మంలోనే నీలుక్కుపోయింది.

సంగ్రామ సంరంభంలో రోలు రోకళ్లు అటూఇటూ పరుగెత్తుతున్నాయి. సొట్టబడ్డ ఓటిబిందెలూ చెంబులూ తమ రాజపుత్ర పరాక్రమాన్ని వెల్లడించుకొంటున్నాయి. ఉట్లు ఉయ్యాల లూగుతున్నాయి. పచ్చళ్లు నేలమీదపడి పొర్లాడుతున్నాయి. తలుపుచెక్కలు తైతక్కలాడుతున్నాయి.

కొంతసేపటికి ఎలాగో ధైర్యం చేసి లోపలికి వెళ్ళింది, ముసలమ్మ. ఓటిబిందెను తీసి చకచకా ఉట్టి మీదకు సర్దబోయింది. తమ అంతర్యుద్ధంలో పరులు - అందులోనూ నరులు - కల్పించుకొన్నారనే ఘోరావమానంచేత ఇరుపక్షాలవారూ ముసలమ్మ మీద తిరగబడి ఆమె వీపు వ్రయ్యలు చేశారు. తలుపుచెక్కల పుణ్యమా అని ముసలమ్మ తల కాస్తా పగిలింది. కుయ్యో మొర్రో మంటూ, చేసేదేమీ లేక ముసలమ్మ గబగబా వీధిలోకి పారిపోయింది.

వీధిలోని నలుగురు పెద్దమనుషుల్ని పిలుచుకొచ్చింది. వాళ్ళలో ఒక భూతవైద్యుడుకూడా ఉన్నాడు. ఆ భూతవైద్యుడు యిల్లు చూడగానే యీ యింట్లో భూతమున్న


రిజిస్టర్డు నెం. 2791 వసంతకాలపు కానుక టెలిగ్రాం : *Swarnbhumi*

## గొప్ప బహుమతి

మీరు తప్పక ఒక బహుమతి గెలవాలి!

అన్ని బహుమతులు గ్యారంటీ చేయబడినది.

అంతా సరిగానున్న ప్రతి ఆన్సరుకు రు. **6225**. మొదటి రెండు వరుసలు సరిగానున్న ప్రతి ఆన్సరుకు రు. **1255** మొదటి ఒక వరుస సరిగా నున్న ప్రతి ఆన్సరుకురు. **135**. a, b or a, c సరిగానున్న ప్రతి ఆన్సరుకు రు. **20**.

| | | | |
|---|---|---|---|
| a | b | | |
| c | | | |
| | | | |
| | | | |

ఇచ్చుట చూపిన చదరంలో 2 నుండి 17 వరకు అంకెలు వాడి నిలువుగగాని, అడ్డముగగాని, అయిమూలలుగా గాని ఎటు కూడినను మొత్తం 38 వచ్చునట్లు వేయవలెను. ఒకసంఖ్య ఒకసారె వాడవలెను.

ఆఖరు పోస్టింగు తేది **2-4-54** ఫలితము **13-4-54**

ప్రవేశరుసుము : ఒక ఎంట్రకి రు. 1/-;

4 ఎంట్రిలకు రు. 3/-లు, 16 ఎంట్రీల ప్రతి సెట్టుకు రు. 10/-

రూల్సు : పై రేటువంతున రుసుముతో సాదాకాగితం మీద ఎన్ని ఎంట్రిలైనను పంపవచ్చును. రుసుము మనియార్డరు ద్వారా గాని పోస్టల్ ఆర్డరు ద్వారాగాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారాగాని పంపవలెను ఢిల్లీలో ఒక పెద్ద బ్యాంకులో డిపాజిటు చేసిన సీల్డుసొల్యూషనుతో, లేక దానివరుసలతో సరిపోలియుండు సొల్యూషను లేక వరుసలు మాత్రమే సరియైనవిగా ఎంచబడును. అంతా సరిగా వచ్చిన సొల్యూషనులను బట్టి మారుచుండును.

గతపోటి ఫలితం

| | | | |
|---|---|---|---|
| 6 | 12 | 9 | 15 |
| 8 | 18 | 3 | 13 |
| 11 | 7 | 14 | 10 |
| 17 | 5 | 16 | 4 |

మొత్తం 42

కానీ గ్యారంటి బహుమతులు మాత్రము మారవు. సొల్యూషనులో ఇంగ్లీషు అంకెలు మాత్రమే వాడండి. ఫలితములకుగాను ఎంట్రీలతో స్వంత అడ్రెసు వ్రాసి టిక్కెట్లు అంటించిన కవరు పంపవలెను. శెక్రటరీ తీర్పు ఖాయము గాను లా ప్రకారము బద్ధమైనదిగాను వుండును. మీ ఎంట్రిలు రుసుములు దిగువ అడ్రెసుకు పంపండి:-

**Capital Traders Regd, (16) Post Box 1475, Ch. Chowk, Delhi**

ఒకడు తన స్నేహితుడితో:— "నాకు పెళ్ళయ్యేదాకా ఆనందమంటే ఏమిటో తెలియలా."

రెండోవాడు :— "పాపం, తెలిసిమాత్రం ఏం చేస్తావ్, పెళ్లయిపోయాక ?"

* * *

మేష్టరు:— "ప్రపంచంలో మనం తల్చుకుంటే చెయ్యలేని పనిలేదు."

విద్యార్థి:— "బయటికి వచ్చిన టూత్ పేస్టును మళ్లీ ట్యూబ్ లోకి మీరులాగగలరా మేష్టారూ ?

దంటూ అందర్నీ అవతల ఉండమని తానొక్కడూ వంట గదిలోకి వెళ్ళి "హ్రాం-హ్రీం-హ్రూం.." అంటూ మంత్రాలు మొదలెట్టాడు. వెంటనే వాడి బుర్ర "ఖంగు" మంది. "బాబోయ్‌నావల్లగా"దంటూ వాడు వీధినపడి పారిపోయాడు. వాడితో పాటు అవచ్చిన వాళ్లుకూడా తోక ఝాడించేశారు.

అప్పటికి యిరుపక్షాల వారూ అలసిపోయారు. పచ్చళ్ళ జాడీలూ, రాచ్చిప్పలూ, కుండలూ ముందే వీరస్వర్గాన్నలంకరించినై. రోలు రోకళ్ల పుణ్యమా అని పాత్ర సామగ్రి ముందే బద్దలయింది. ఈ మహా యుద్ధంలో రేకుబిందె శాస్త్రాలొట్టిముక్కలాగా సాగి పత్తా లేకుండా పారిపోయింది. ఇక మిగిలిన రోలు రోకళ్లు కూడా యుద్ధం చేసి అలసిపోయాయి. అయినా అల్లాగే మరికొంచెంసేపు పోరు సల్పి యిరుపక్షాలవారూ సంగ్రామం నుంచీ విరమించుకొని విశ్రాంతితీసుకొన్నారు.

వీధిలోకి వెళ్ళిన ముసలమ్మ ఒక వందమందిని వెనకేసుకువచ్చి గబగబా తలుపు తీసింది. తానొక పెద్ద డిటెక్టివ్‌లా ఏదో చెయ్యబోతున్నానని ఆశపడిన ముసలమ్మకు ఒక్కసారిగా ఆశాభంగమయింది. ప్రతివస్తువూ యుద్ధరంగంలో చావు దెబ్బలుతిని ఎక్కడివక్కడ కదల మెదలక శాశ్వతనిద్ర నటిస్తునై. ఆ వచ్చిన పెద్దమనుష్యులంతా ముసిల్ది చెప్పిన విడ్డూరంకోసం మొఖం అంతా కళ్ళు చేసుకొని గడియసేపు దీక్షగా చూశారు. "ఇంట్లో సామాను చిందరవందరగా వుండటమైతే వున్నయికాని,ఒక్కటీ కదలటంలేదు. ఇదంతా ఆ ముసిల్దాని మాయరా"- అంటూ ముసలమ్మ బుర్ర మొత్తేత్తించి, ఎవరికి అందింది వాళ్లు తలా ఒక వస్తువూ పట్టుకొని ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయారు.

పాపం ఆముసలమ్మ ఒళ్లు హూనమైనందుకు బాధపడుతూ, దక్కిన సామాను చెడిపోయినందుకు వెక్కివెక్కి ఏడుస్తూ, దక్కని సామానులు పోయినందుకు మూలుగుతూ, సినిమానుంచీ వచ్చే తనవాళ్లకు ఏమి చెప్పుకోవాలో జవాబు తెలియక శోకాలు పెట్టిపెట్టి, అలిసి, సొలిసి ఆవలించి నిద్రపోయింది.

★

కాంచన ద్వీపం
వెల 1-8-0
పోస్టుఖర్చులు ప్రత్యేకం.
ఆంధ్రగ్రంథమాల, మద్రాసు-1.

నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిర్బలత, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—
20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 15 అ.
పి. పి. ఏ. &కంపెని. "ఆయుర్వేదసమాజం"
పెరిదేపి- నెల్లూరు జిల్లా.

మనిషిలో మనిషి
మూలం :
రాబర్ట్ లూయీ స్టీవెన్సన్
అనువాదం :
దాసు వామనరావు
ప్రతి వెల రూ. 1-4-0
ఆంధ్రగ్రంథమాల,
తంబుచెట్టివీధి, : : మద్రాసు 1.
చిరునామాకు వ్రాసి ఇప్పుడే రిజర్వు చేసుకొనండి.